


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
21-02-2026
పేజీలు: 02




## FSL అగ్నిప్రమాదంలో సంచలనం..
# కీలక డేటా గల్లంతు

హైదరాబాద్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో కీలక మలుపు చోటు చేసుకున్నది. ఈ ఘటనపై విచారణ చేపట్టిన నాగ్‌పూర్ ప్రత్యేక బృందం తాజాగా ఒక నివేదికను సిద్ధం చేసింది. ఈ ప్రమాదంలో సుమారు 1100 ఫైళ్లు అగ్నికి ఆహుతయ్యాయని, దీనివల్ల అనేక కీలక కేసుల సమాచారం కాలిబూడిదైందని అధికారులు ధృవీకరించారు. దగ్ధమైన ఈ 1100 కేసులకు సంబంధించిన డేటాను తిరిగి రికవరీ చేసేందుకు ప్రత్యేక బృందం తీవ్రంగా ప్రయత్నించింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సమాచారాన్ని సేకరించాలని చూసినప్పటికీ, ఫలితం లేకుండా పోయింది. ఈ కేసుల డేటా రికవరీ చేయడం దాదాపు అసాధ్యమని ప్రత్యేక బృందం తేల్చి చెప్పింది. కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు, పత్రాలు మంటల్లో కలిసిపోవడంతో ఇప్పుడు ఆయా కేసుల దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. డేటా రికవరీ కష్టమని తేలడంతో అధికారులు తదుపరి చర్యల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

## చేతులతోనే చంపేస్తా.. ఓవైసీ బ్రదర్స్‌కు
# ఎమ్మెల్యే రాజాసింగ్ వార్నింగ్



బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రంలో పెను సంచలనంగా మారాయి. మరాఠా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో భాగంగా గురువారం వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రాజాసింగ్.. ఎంఐఎం పార్టీ అగ్రనేతలు అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సెక్యూరిటీ లేకుండా వస్తే.. ఎవరి సత్తా ఏంటో చూపిద్దాం అంటూ బహిరంగ సవాల్ చేశారు. ప్రతీ సభలో 15 నిమిషాలు అంటూ ఓవైసీ బ్రదర్స్ కామెంట్లు చేస్తున్నారన్న రాజాసింగ్.. 15 నిమిషాలు కాకుండా 15 ఏళ్లు సమయం ఇచ్చినా వాళ్లు ఏమీ చేయలేరని రాజాసింగ్ ఎద్దేవా చేశారు. ఓవైసీ బ్రదర్స్‌కు దమ్ముంటే 15 నిమిషాలు కాదని.. తనకు 5 నిమిషాలు చాలు అని తెలిపారు. అవే డైలాగ్‌లు మళ్లీ మళ్లీ చెబుతూ టైమ్ పాస్ చేయడం మానుకోవాలని రాజాసింగ్ హితవు పలికారు. ఇదే విషయం గతంలో కూడా తాను చెప్పానని.. మళ్లీ ఇప్పుడు కూడా చెబుతున్నానని పేర్కొన్నారు. ఓవైసీ బ్రదర్స్ సెక్యూరిటీ లేకుండా రావాలని.. తాను కూడా సెక్యూరిటీ లేకుండా వస్తానని సవాల్ విసిరారు. తనకు తుపాకులు, కత్తులు వద్దని.. తన చేతులతోనే చంపేస్తానంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి కారణం అవుతున్నాయి. ప్లేస్ ఎక్కడో మీరే డిసైడ్ చేయండి అంటూ ఓవైసీ బ్రదర్స్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మీ అడ్డాకు రావాలా లేక మీ ఇంటికే రావాలా అంటూ కామెంట్లు చేశారు. దమ్ముంటే ప్లేస్ మీరే డిసైడ్ చేయాలని ఓవైసీ బ్రదర్స్‌కు ఛాలెంజ్ విసిరారు. ఆ 5 నిమిషాల్లో తామేంటో ప్రత్యక్షంగా చూపిస్తానని అక్బరుద్దీన్ ఒవైసీకి రాజాసింగ్ బహిరంగ సవాల్ విసిరారు. డేట్, టైమ్, ప్లేస్ అన్నీ నువ్వే డిసైడ్ చేయ్.. ఎక్కడికైనా రావడానికి తాను రెడీగా ఉన్నానని తెలిపారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గతంలో అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడారని.. దానికి జవాబు చెప్పే రోజు దగ్గర్లోనే ఉందంటూ తీవ్ర హెచ్చరికలు చేశారు. ఓవైసీ బ్రదర్స్ రాజకీయాలు ఓల్డ్ సిటీ దాటి బయటికి రావడం లేదని విమర్శలు చేశారు. రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలకు సభకు వచ్చిన యువతను ఉర్రూతలూగించాయి. రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఒకప్పుడు భారత్‌పై ఉగ్రదాడి జరిగితే పాకిస్తాన్‌కు లవ్ లెటర్ రాసేవాళ్లని ఎద్దేవా చేసిన రాజాసింగ్.. కానీ ఇప్పుడు మాత్రం నేరుగా సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్ చేసే ప్రభుత్వం ఉందని గత ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఛత్రపతి శివాజీ నుంచే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్జికల్ స్ట్రైక్ నేర్చుకున్నారని చెప్పారు.




## చట్నీస్ రెస్టారెంట్‌లో పేలిన ఇడ్లీ స్టీమర్..
# సిబ్బందికి తీవ్ర గాయాలు


హైదరాబాద్ ఎల్బీ నగర్‌లో ఉన్న చట్నీస్ హోటల్‌లో భారీ పేలుడు చోటు చేసుకుంది. ఆర్కేపురం ప్రాంతంలోని చట్నీస్ రెస్టారెంట్ కిచెన్‌లో ఉన్న ఇడ్లీ స్టీమర్ పేలిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఒకేసారి భారీ పేలుడు శబ్దం రావడంతో.. అందులో ఉన్న కస్టమర్లు భయంతో పరుగు పరుగున బయటకు వెళ్లిపోయారు. ఇక భారీ శబ్దంతో ఇడ్లీ స్టీమర్ పేలిన ఘటనలో అక్కడే ఉన్న సిబ్బందికి గాయాలు అయ్యాయి. హుటాహుటిన వారిని దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించి ట్రీట్‌మెంట్ అందిస్తున్నారు. ముగ్గురు హోటల్ సిబ్బందికి తీవ్ర గాయాలు కాగా.. ఒకరి తలకు బలమైన గాయమైనట్లు డాక్టర్లు వెల్లడించారు. మరో ఇద్దరు సిబ్బందికి.. కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు తెలిపారు. ఇక చట్నీస్ హోటల్‌లో పేలుడు జరిగిందన్న సమాచారం తెలుసుకున్న ఎల్బీ నగర్ పోలీసులు.. వెంటనే ఘటనా స్థలికి చేరుకుని.. సహాయక చర్యలు చేపట్టారు. అధిక వేడి కారణంగానే ఇడ్లీ స్టీమర్ పేలినట్లు ప్రాథమికంగా పోలీసులు అంచనాకు వచ్చారు. మరోవైపు.. ఇడ్లీ స్టీమర్ పేలుడు జరిగిన కిచెన్‌ను ఎల్బీ నగర్ పోలీసులు, హైడ్రా సిబ్బంది, బాంబ్ స్క్వాడ్ టీమ్స్ పరిశీలించాయి. ఇడ్లీ స్టీమర్ బాగా వేడెక్కడం వల్లే ఈ పేలుడు సంభవించిందా లేక ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. పేలుడుకు గల కచ్చితమైన కారణం ఏంటి అనేదానిపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈ ఇడ్లీ స్టీమర్ పేలుడుతో హోటల్ సిబ్బందితోపాటు.. స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.



# సిరాజ్‌కు గాయం


టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఆదివారం దక్షిణాఫ్రికాతో జరగనున్న కీలకమైన సూపర్ 8 పోరుకు ముందు భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ శుక్రవారం సాయంత్రం నెట్స్ ప్రాక్టీస్ సమయంలో గాయపడ్డాడు. నరేంద్ర మోదీ స్టేడియంలో ప్రాక్టీస్ సెషన్ జరుగుతుండగా హార్దిక్ పాండ్యా కొట్టిన బంతి నేరుగా వెళ్లి సిరాజ్ ఎడమ మోకాలికి తగిలింది. దీంతో అతను తీవ్రమైన నొప్పితో విలవిల్లాడిపోయాడు. వెంటనే రంగంలోకి దిగిన ఫిజియోలు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ, నొప్పి తగ్గకపోవడంతో సిరాజ్ నెట్స్ నుంచి వెళ్లిపోయాడు. ఈ మెగా టోర్నీలో సిరాజ్ ప్రయాణం మొదటి నుంచీ నాటకీయంగా సాగుతోంది. వార్మప్ మ్యాచ్ లో హర్షిత్ రాణా గాయపడటంతో చివరి నిమిషంలో సిరాజ్ జట్టులోకి వచ్చాడు. జస్ ప్రీత్ బుమ్రా అనారోగ్యం కారణంగా అమెరికాతో జరిగిన మ్యాచ్ లో తుది జట్టులో చోటు దక్కించుకున్న సిరాజ్.. ఆ మ్యాచ్ లో అద్భుత ప్రదర్శన చేశాడు. 3 వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

# ఆస్ట్రేలియా టూర్‌లో పాక్ హాకీ జట్టుకు అవమానం



పాకిస్థాన్ హాకీ జట్టు ప్రస్తుతం అత్యంత దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. కనీస సౌకర్యాలు లేక, ఉన్న నిధులు పక్కదారి పట్టడంతో ఆ దేశ ఆటగాళ్లు విదేశీ గడ్డపై తీవ్ర అవమానాలకు గురయ్యారు. ఆస్ట్రేలియాలో జరిగిన హాకీ వరల్డ్ లీగ్ లో పాల్గొనేందుకు వెళ్లిన పాక్ జట్టుకు చేదు అనుభవం ఎదురైంది. హోటల్ బిల్లులు చెల్లించకపోవడంతో యాజమాన్యం వారి రిజర్వేషన్లను రద్దు చేసింది. దీంతో ఆటగాళ్లు కాన్‌బెర్రా వీధుల్లో పడాల్సి వచ్చింది. 5 స్టార్ హోటళ్లలో బస కోసం పాకిస్థాన్ స్పోర్ట్స్ బోర్డ్ (పీఎస్ బీ) సుమారు రూ. కోటి (10 మిలియన్లు) కేటాయించినప్పటికీ, ఆటగాళ్లను మాత్రం ఎయిర్ బిఎన్బీ గదుల్లో ఉంచారు. నిధుల కొరత కారణంగా ఆటగాళ్లే స్వయంగా బట్టలు ఉతుక్కుంటూ, పాత్రలు కడుక్కుంటూ గడపాల్సి రావడం గమనార్హం. ఈ వ్యవహారం పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ (పీహెచ్ ఎఫ్) వైఫల్యాన్ని ఎండగట్టింది.

## ఘోర రోడ్డు ప్రమాదం
# డెలివరీ బాయ్ దుర్మరణం



దేశ రాజధాని ఢిల్లీలోని తిలక్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున విషాదకర సంఘటన చోటుచేసుకుంది. నజాఫ్‌గఢ్ రోడ్డులోని సుభాష్ నగర్ మెట్రో రెడ్ లైట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 25 ఏళ్ల డెలివరీ ఎగ్జిక్యూటివ్ ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని రఘుబీర్ నగర్‌కు చెందిన హేమ్ శకర్ గా పోలీసులు గుర్తించారు. ఫిబ్రవరి 21వ తేదీ తెల్లవారుజామున సుమారు 3:26 గంటల సమయంలో ఈ ప్రమాదంపై పోలీసులకు సమాచారం అందింది. ప్రమాద సమయంలో హేమ్ శకర్ తన ఎలక్ట్రిక్ స్కూటర్ పై వెళ్తుండగా వేగంగా వచ్చిన కారు ఆయన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన బాధితుడిని వెంటనే దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నట్లు అలాగే నజాఫ్‌గఢ్‌కు చెందిన డ్రైవర్ మోహిత్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ ఘటనపై తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి.

## బాబర్ అజామ్ డిమోషన్‌కు
# కారణం చెప్పిన హెస్సన్

టీ20 వరల్డ్ కప్‌లో బాబర్ అజామ్‌కు డిమోషన్ అనుభవం ఎదురైంది. అతడు బ్యాటింగ్‌కు దిగే వరుస క్రమం మరింత వెనక్కి జరిగింది. సాధారణంగా మూడో లేదా నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే బాబర్.. నమీబియాతో పోరులో 5వ నెంబర్‌లో కూడా క్రీజ్‌లోకి అడుగు పెట్టలేదు. ఇది పెద్ద చర్చకు దారితీసింది. ఈ డిమోషన్‌కు గల కారణాన్ని పాక్ హెడ్ కోచ్ మైక్ హెస్సన్ వివరించారు. పవర్‌ప్లేలో తక్కువ స్ట్రైక్ రేట్ కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. నమీబియా మ్యాచ్ ముగిసిన తర్వాత, న్యూజిలాండ్‌తో మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన హెస్సన్ ఈ విషయాలను పంచుకున్నారు. వరల్డ్ కప్‌లో పవర్‌ప్లేలో బాబర్ స్ట్రైక్ రేట్ 100 కంటే తక్కువగా ఉందని, ఆ సమయంలో జట్టుకు మరింత వేగంగా ఆడే ఆటగాడు అవసరమని బాబర్‌కు కూడా తెలుసని ఆయన పేర్కొన్నారు.



ఆసియా కప్ తర్వాత బాబర్‌ను ఒక ప్రత్యేక పాత్ర కోసం జట్టులోకి తీసుకున్నట్లు హెస్సన్ వివరించారు. ఆ బాధ్యతను చివరి ఓవర్లలో ఇతర ఆటగాళ్లు మరింత సమర్థంగా నిర్వహించగలరని బాబర్ కూడా అంగీకరించినట్లు ఆయన తెలిపారు. అదే సమయంలో, పేసర్ సల్మాన్ మిర్జా ప్రదర్శనపై కూడా హెస్సన్ స్పందించారు.



## అందాల రాశీకి పెరుగుతున్న ఆఫర్స్

హీరోయిన్ గా సక్సెస్ కావడం అంత ఈజీ కాదు. ఎంతో మంది కుర్ర హీరోయిన్స్ ఇప్పటికీ స్టార్ డమ్ కోసం ఎదురుచూస్తున్నారు. అవకాశాలు వస్తున్న అదృష్టం కలిసి రాని భామల్లో రాశి ఖన్నా ఒకరు. ముందుగా ఈ చిన్నది బాలీవుడ్ లో సినిమాలు చేసింది. ఆ తర్వాత ఊహలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది ఈ వయ్యారి భామ. మొదటి సినిమా మంచి విజయాన్ని అందుకుంది. అలాగే అందం, నటన పరంగాను రాశీ ఖన్నాకు మంచి మార్కులు పడ్డాయి.ఇక రాశీ ఖన్నా తెలుగులో వరుసగా సినిమాలు చేసింది. యంగ్ హీరోలకు జోడీగా నటిస్తూ దూసుకుపోయింది ఈ అమ్మడు. అలాగే తమిళ్ లోనూ ఛాన్స్ లు అందుకుంది. తెలుగులో స్టార్ హీరో ఎన్టీఆర్ నటించిన జై లవ కుశ సినిమాలోనూ నటించింది.

## పీఎంశ్రీ స్కూళ్లలో అభివృద్ధి పనులు
# త్వరితగతిన పూర్తి చేయాలి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన 16 పాఠశాలల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా విద్యాధికారి, టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారులతో నిర్వహించిన సమీక్షలో, అదనపు తరగతి గదులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఇంకుడు గుంతలు వంటి నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పనులు కూడా పూర్తి చేయాలని ఆదేశించారు.



## తెలంగాణలో ఏఐ స్టార్టప్ విలేజ్ ఏర్పాటు చేస్తాం: రేవంత్ రెడ్డి

కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సు (ఏఐ సమ్మిట్)కు దేశ, విదేశాల నుంచి అతిథులు హాజరైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తెలంగాణ నుంచి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏఐ సదస్సులో ప్రసంగించారు. ప్రస్తుతం టెక్నాలజీ ప్రపంచం దూసుకెళ్తోందని పేర్కొన్న రేవంత్ రెడ్డి.. అందులో ఏఐ రాకతో మరింత వేగం పెరిగిందని తెలిపారు. అదే సమయంలో ఈ ఏఐ టెక్నాలజీలో భారత్ కూడా పరుగులు పెట్టాలంటే దాని కోసం కేంద్ర ప్రభుత్వంలో స్పెషల్‌గా ఒక మంత్రిత్వ శాఖను రూపొందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రేవంత్ రెడ్డి హితవు పలికారు. ఏఐ వినియోగం, కంట్రోల్, మార్గదర్శకాలు, నేషనల్ సెక్యూరిటీ వంటి అంశాలను ఈ మంత్రిత్వ శాఖ అత్యవసరం అని పేర్కొన్నారు. ప్రపంచ టెక్ దిగ్గజాలన్నీ ఈ ఏఐ సదస్సుకు వచ్చాయని.. మనం చేసే ఆలోచనలే జీవితాలు మార్చేస్తాయని తెలిపారు. మనుషుల కంటే ఏఐకి మరిన్ని ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. సమాజంలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి కొత్త కొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఏ విధంగా మార్చాయో.. ఇప్పుడు ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక టెక్నాలజీ అని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఏఐ కేవలం ఇంకో టెక్నాలజీ మాత్రమే కాదని.. మానవ పరిణామ క్రమంలో చాలా కీలక మలుపు అని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఉన్న మెషీన్లు, టెక్నాలజీల లాగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని.. సమాచారాన్ని విశ్లేషించగలదని.. దానికి అనుగుణంగా నిర్ణయాలు కూడా తీసుకుంటుందని వెల్లడించారు. అయితే ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఏఐ టెక్నాలజీలో పోటీ మొదలైందని.. ఏఐలో కొన్ని దేశాలు, కంపెనీలు చాలా అడ్వాన్స్‌డ్‌గా ఉన్నాయని రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో పారిశ్రామిక విప్లవాల్లో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోవడాన్ని గుర్తు చేసిన సీఎం రేవంత్.. ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని ముందస్తు జాగ్రత్తలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా సర్వీసులు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో అప్రతిహత విజయాలు దక్కించుకున్న భారత్.. ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. భారత్‌కు నేషనల్ ఏఐ రోడ్‌మ్యాప్ చాలా అత్యవసరమని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఏఐ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ప్రతీ దశలో సెమీకండక్టర్ చిప్ తయారీ, జీపీయూ సామర్థ్యాలు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ వినియోగం, ఏఐ ప్లాట్‌ఫామ్‌లు, అప్లికేషన్లు వంటి స్పష్టమైన వ్యూహాలతో భారత్ ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రపంచంలో ఏఐ తెస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు.
కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే హైదరాబాద్‌లో అలాంటి ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

### వేధింపులతో భర్త కుటుంబంపై గృహహింస కేసు..

# ప్రతీకారంతో రగిలిపోయి మాజీ భార్య హత్య

మీరు సోషల్ మీడియాలో సరదా కోసం పెట్టే ఒక్క ఫోటో లేదా ఒక రీల్ మనిషి ప్రాణాలనే తీస్తుందని ఎప్పుడైనా ఊహించారా? హైదరాబాద్ వనస్థలిపురంలో బుధవారం జరిగిన గర్భిణి హత్యోదంతంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గృహహింస చట్టం కింద కేసు పెట్టి తన కుటుంబాన్ని రోడ్డుకీడ్చిందని భావించిన మహేశ్... సునీతను హత్య చేయడానికి వెయిట్ చేసిన విధానం వింటే మీ వెన్నులో వణుకు పుట్టడం ఖాయం. కెనడా నుంచి కక్షతో వచ్చి, సునీత చేసిన ఇంస్టాగ్రామ్ రీల్ ఆధారంగా తన లొకేషన్ కనిపెట్టి.. తన మాజీ భార్యను కరెంటు రంపంతో ముక్కలు చేయాలనుకున్నాడు. తర్వాత అరెస్ట్ అయ్యాడు.. కానీ.. పోలీసులు అతని బ్యాగ్ చెక్ చేసినప్పుడు బయటపడ్డ వస్తువులు చూసి షాక్ అయ్యారు! నిందితుడు దేవరకొండ మహేష్‌ది పెద్దపల్లి జిల్లా.2019-22 వరకు ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేసి, కెనడా వెళ్లాడు... ఇమహారాష్ట్రలోని చంద్రపురి జిల్లా బల్లార్పూర్ మండలం తిలక్‌వాడ్‌కి చెందిన సునీతతో పదేళ్ల క్రితమే ప్రేమాయణం మొదలైంది. 2014లో మహేశ్ సొంతూరు, సునీత అమ్మమ్మ గ్రామం ఒక్కటే కావటంతో ఇద్దరి మధ్య పరిచయం..ప్రేమగా మారింది2022 ఏప్రిల్‌లో పెళ్లి చేసుకున్నారు. సునీతకు వీసా రాకపోవడంతో మహేశ్ ఒక్కడే కెనడా వెళ్లాడు. అక్కడికెళ్లాక ఫోన్‌కాల్స్‌కు స్పందించకపోవడంతో భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ కారణంగా గొడవలు జరుగుతున్న సమయంలోనే సునీత 2023 అక్టోబరులో కెనడా వెళ్లింది. గొడవలు మరింత పెరగడంతో కొన్ని నెలలకే స్వదేశానికి తిరిగొచ్చిన సునీత... మహారాష్ట్రలోని బల్లార్పూర్ ఠాణాలో భర్తపై గృహహింస కేసు పెట్టింది. మహేశ్ తో పాటు, అతని తల్లిదండ్రులపైన కేసు పెట్టింది. ఆ తర్వాత మహేశ్ తల్లి




మరణించింది.. ఆలోపే పోలీసుల నుంచి, లుక్‌ఔట్ నోటీసులు.. ఆ కారణంగా మహేశ్ వీసా రిజెక్ట్ అయ్యింది.. ఆ తర్వాత ఆమె మహేశ్ కి దూరంగా మరో వ్యక్తితో ఉంటుందని తెలుసుకున్నాడు. చట్టాల్లో మహిళలకు ఉన్న అడ్వాంటేజీలను క్యాష్ చేసుకుని.. తప్పుడు కేసులు పెట్టి మగాడి జీవితాన్ని నాశనం చేసిందని భావించాడు. ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఇలాంటి ఆడది బతక్కూడదని.. చంపేయాలని డిసైడ్ అయ్యాడు. కానీ.. సునీత ఎక్కడుందో తెలియక తన అడ్రెస్ కోసం వెతుకుతున్న మహేష్‌కు ఆమె ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ లో ఒక క్లూ దొరికింది. ఆమె రీల్‌లో ఉన్న ఒక గుడి ఫోటో ఆధారంగా అది వనస్థలిపురంలోని గుడి అని కనిపెట్టాడు మహేశ్. వనస్థలిపురంలో గాలించి చివరకు ఆమె ఉంటున్న అపార్ట్‌మెంట్‌ను పట్టేశాడు. సునీత అప్పటికే వేరే పెళ్లి చేసుకుని గర్భిణిగా ఉంది. అది చూసి మరింత రగిలిపోయిన మహేష్.. పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగాడు. అతను కేవలం కత్తితో రాలేదు.. తన బ్యాగులో ముందుగానే ఆన్ లైన్ లో ఆర్డర్ పెట్టుకున్న కత్తి, విద్యుత్ రంపాలు , పెట్రోలు డబ్బా తెచ్చుకున్నాడు. ఒకవేళ సునీత తలుపులు వేసుకుంటే రంపంతో కోసైనా లోపలికి వెళ్లాలని, ఎవరైనా అడ్డు వస్తే పెట్రోల్‌తో తగలబెట్టాలని ప్లాన్ చేశాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లోకి చొరబడి ఆ గర్భిణిని అత్యంత దారుణంగా నరికి చంపేశాడు. ప్రస్తుతం మహేశ్ పోలీసుల అదుపులో ఉన్నాడు.

## భిక్షగాడి చిరిగిన చొక్కా వెనుక దాగున్న లక్షల సంపద!

పదేళ్లుగా భిక్షాటన చేస్తూ కనిపించిన ఒక వృద్ధుడి దగ్గర ఏకంగా లక్షలాది రూపాయల సంపద బయటపడింది. హర్యానాలోని అంబాలాలో వెలుగుచూసిన ఈ ఉదంతం అందరినీ విస్తుగొలుపుతోంది. చిరిగిన చొక్కా, మాసిన బట్టలతో దీనంగా కనిపించే ఆ యాచకుడి పెట్టెలో నోట్లకట్టలు, బ్యాంకు ఖాతాలో లక్షల రూపాయలు ఉండడం స్థానికులను ఆశ్చర్యపరిచింది. వివరాల్లోకి వెళితే.. అంబాలా రైల్వే స్టేషన్ రోడ్డులోని హనుమాన్ ఆలయం వద్ద లేఖరాజ్ అంటే అందరికీ సుపరిచితమే. పాత మూడు చక్రాల సైకిల్, మాసిన బట్టలు, నీరసించిన ముఖంతో గత పదేళ్లుగా అక్కడే కనిపిస్తూ భక్తులు ఇచ్చే చిల్లరతో కాలం వెల్లదీసేవాడు. తన సైకిల్ వెనుక ఎప్పుడూ ఒక



పాత ఇనుప ట్రంకు పెట్టెను కట్టేసుకుని తిరిగేవాడు. కొన్నిరోజులుగా లేఖరాజ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ సంగతి తెలిసి 'వందేమాతరం దళ్' అనే సేవా సంస్థ ప్రతినిధులు ఈ నెల 9న లేఖరాజ్ ను స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. దురదృష్టవశాత్తు మూడు రోజుల చికిత్స తర్వాత లేఖరాజ్ మరణించారు. దిక్కులేని వృద్ధుడికి ఆ సంస్థ సభ్యులే అంత్యక్రియలు నిర్వహించారు.




### రాత్రిపూట పోస్టల్ సేవలు, రాత్రి 8 నుంచి ఉదయం 8 వరకు

## తపాలా శాఖ సర్వీసులు

ఒకప్పుడు పోస్టల్ సర్వీసులు ప్రజలకు ఎంతో ఉపయోగపడేవి. లేఖలు, డబ్బులు, వస్తువులు పంపించేందుకు గతంలో తపాలా శాఖ పైనే ప్రజలు ఆధారపడేవారు. రవాణా సౌకర్యాలు పెరగడం, ఇంటర్నెట్, ఫోన్లు, బ్యాంకులు అందుబాటులోకి రావడంతో పోస్టల్ సర్వీసులకు కాలం చెల్లింది. దీంతో తపాలా శాఖ కూడా కాలానికి అనుగుణంగా మార్పులు చేసుకుని.. ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా అప్‌డేట్ అవుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రజలకు అందుబాటులో మరిన్ని సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే ఇక నుంచి రాత్రిపూట కూడా పోస్టల్ సేవలను ప్రజలకు అందించాలని నిర్ణయించింది. పోస్టల్ సేవలు నిరంతరాయంగా, వేగవంతంగా కొనసాగుతున్నాయి. తపాలశాఖను క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత చేరువ చేసేందుకు యంత్రాంగం నిర్విరామంగా కృషి చేస్తోంది. గతానికి భిన్నంగా రాత్రి పూట కూడా పనిచేస్తూ 'సదా మీ సేవలో' అంటున్నారు పోస్టల్ సిబ్బంది. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు అత్యవసరంగా పంపించే స్పీడ్ పోస్టులను మరింత త్వరగా చేరవేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.




# వరుస ఆఫర్లతో బిజీబిజీ

శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస ఆఫర్లు సొంతం చేసుకుంటోంది. ఇంకా హిందీలో అరంగేట్రం చేయకముందే రెండో సినిమా ఆఫర్‌ను దక్కించుకుంది. దీన్ని బట్టి చూస్తే.. రష్మిక మందన్నా మాదిరిగా శ్రీలీల కూడా బాలీవుడ్‌లో స్థిరపడే ఛాన్స్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం శ్రీలీల ఆషికీ ఫ్రాంచైజీ మూడవ భాగంలో కార్తీక్ ఆర్యన్ సరసన నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ మూవీ ఇంకా సెట్స్ మీద ఉన్నలోపే దోస్తానా 2 చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. మరోవైపు రణవీర్ సింగ్, శ్రీలీల, బాబీ డియోల్ కలిసి నటించిన ఒక యాడ్‌ను అట్లీ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే.

## ట్రంప్ విధించిన దిగుమతి సుంకాలను కొట్టివేసిన సుప్రీంకోర్టు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలకు ఆ దేశ సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇతర దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై ట్రంప్ ఏకపక్షంగా విధించిన భారీ సుంకాలను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ తీర్పుతో భారత ఎగుమతిదారులకు తక్షణమే భారీ ఊరట లభించినట్లయింది.1977 నాటి అత్యవసర ఆర్థిక అధికారాల చట్టాన్ని అడ్డం పెట్టుకుని సుంకాలు విధించే అధికారం అధ్యక్షుడికి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇది పూర్తిగా అమెరికా పార్లమెంట్ అయిన కాంగ్రెస్ పరిధిలోని అంశమని 6-3 మెజారిటీతో తేల్చి చెప్పింది. ఈ తీర్పుతో ట్రంప్ ఏకపక్ష వాణిజ్య నిర్ణయాలకు అడ్డుకట్ట పడింది.సుప్రీంకోర్టు తీర్పు భారత వాణిజ్య వర్గాలకు పెద్ద ఊరటనిచ్చింది. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం భారత్ నుంచి వచ్చే వస్తువులపై 18 శాతం సుంకం విధించాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రతిపాదన తాజా తీర్పుతో చెల్లకుండా పోయింది. అంతేకాకుండా, ఇప్పటివరకు అక్రమంగా వసూలు చేసిన పన్నులను తిరిగి పొందేందుకు భారత కంపెనీలకు అవకాశం లభించనుంది. ఫలితంగా అమెరికా మార్కెట్‌లో భారత ఉత్పత్తుల పోటీతత్వం పెరగనుంది.అయితే, ఈ తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. దీనిని 'సిగ్గుచేటు'గా అభివర్ణించిన ఆయన, మరో



చట్టంలోని సెక్షన్ 122 కింద అన్ని దేశాలపై 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తానని ప్రకటించారు. అదే సమయంలో భారత్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో ఎలాంటి మార్పు ఉండదని, భారత్ టారిఫ్‌లు చెల్లించాల్సిందేనని ఆయన నొక్కిచెప్పడం గమనార్హం. సుప్రీంకోర్టు తీర్పు ప్రస్తుతానికి ఊరటనిచ్చినా, ట్రంప్ తాజా హెచ్చరికలతో వాణిజ్య రంగంలో కొంత అనిశ్చితి నెలకొంది.

### క్రీడల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపాలనేదే లక్ష్యం: మంత్రి

రాష్ట్రాన్ని క్రీడల్లో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చారని మక్తల్ ఎమ్మెల్యే, మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం గచ్చిబౌలి స్టేడియంలో సీఎం కప్ సెకండ్ ఎడిషన్ ను ప్రారంభించి మాట్లాడుతూ, ఆటల్లో క్రమశిక్షణ, స్వార్థం, నైపుణ్యం ఉంటేనే విజయం సాధించవచ్చని, బాల్యంలో లక్ష్యం పెట్టుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని, ప్రతి క్రీడాకారుడు ఆటలపై దృష్టిసారించాలని, ఆడాలనే కసి ఉంటేనే దేశం తరపున ఆడే అవకాశం వస్తుందని పేర్కొన్నారు.





### అంబటి రాంబాబు, జక్కంపూడి రాజాలపై కేసు నమోదు

మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుపై మరో కేసు నమోదయింది. ఆయనతో పాటు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పలువురు వైసీపీ నేతలపై కూడా రాజమండ్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ఇచ్చిన నోటీసులను ధిక్కరించి భారీ ర్యాలీ నిర్వహించడంతో వివిధ సెక్షన్ల కింద కేసు ఫైల్ చేశారు. ఈ కేసును రాజమండ్రి ప్రకాశ్ నగర్ సీఐ బాజీలాల్ విచారణ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... 18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబు రెండు రోజుల క్రితం బెయిల్ పై విడుదలైన సంగతి తెలిసిందే. ఈనెల 19న రాజమండ్రి నుంచి గుంటూరుకు బయలుదేరిన అంబటి రాంబాబుకు పోలీసులు సెక్షన్ 30 కింద నోటీసులు అందించారు. కార్లతో భారీ ఊరేగింపు నిర్వహించవద్దని, రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై అధిక వాహనాలతో వెళ్లకూడదని నోటీసులో పేర్కొన్నారు. అయినప్పటికీ అంబటి, జక్కంపూడి రాజా తమ అనుచరులతో కలిసి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో వారిపై కేసులు నమోదయ్యాయి.